క్లుప్తంగా

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



సక్కమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : పట్టణ పరిధిలోని పిల్లలమర్రికి చెందిన చింతలచెర్వు సక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో శనివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, రాపర్తి సైదులుగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



మల్లయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ రాములు నాయక్

నూతనకల్ : మండల వనరుల కేంద్రంలో గత 22 ఏళ్లుగా మెసెంజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న బోయిన మల్లయ్య సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి రాములు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రీసోర్స్ భవనంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లయ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట : పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ సీ ఉద్యోగుల మీటింగ్‌లో ఈ ఎన్నిక నిర్వహించారు. సూర్యాపేట డివిజన్ సెక్రెటరీగా జంజిరాల సైదులు, ప్రెసిడెంట్‌గా దయాకర్, ట్రెజరర్‌గా సునీల్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా పెరికదాస్



నూతన కమిటీ సభ్యులు

చివ్వెంల : మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా పెరికదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఐలాపురంలోని ఆర్‌సీఎం చర్చిలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ధరావతు సాల్మన్ లింగానాయక్, దేవరప్పల రమేష్, ఉపాధ్యక్షులుగా ధరావతు జ్యోతి నాయక్, ప్రధాన కార్యదర్శిగా కలకొండ పాల్, సహాయ కార్యదర్శిగా అబ్రహం, కోశాధికారిగా ధరావతు రమేష్, మీడియా కన్వీనర్‌గా విక్టర్‌పాల్, సభ్యులుగా కలకొండ యోహాన్, ఈదయ్య, సలహాదారులుగా పి.రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నియోజకవర్గ అధ్యక్షుగు జలగం డేవిడ్‌రాజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ తదితరుల పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 5న నిర్వహించే వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల మహాసభలను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల రాష్ట్ర నాయకుడు మామిడి పరంధాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చినపంగి నర్సయ్య, రణపంగ కృష్ణ, నెమ్మాది లక్ష్మి, లక్కపాక ముత్తయ్య, చందా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తిరుమలగిరి : అనంతారం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కందుకూరు మంగమ్మ మాట్లాడారు. అమ్మ అంటే ఎంత ఇష్టమో.. అంతే ప్రేమతో చెట్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

- వార్డుల వారీగా ఓటర్ల విభజన ప్రక్రియ ప్రారంభం
- కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఉండేలా ఏర్పాట్లు



ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల విభజన శిక్షణలో పాల్గొన్న అధికారులు

తిరుమలగిరి : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా, వార్డుల వారీగా ఓటర్ల విభజన తదితర అంశాలపై ఎంపీడీఓ, ఎంపీఓలు, ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. వార్డుల వారీగా ఓటర్ల విభజనపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. తిరుమలగిరి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 20334 మంది ఉండగా పురుషులు 10383 మంది, మహిళలు 9951 మంది ఉన్నారు. ఇందులో ఎస్టీ ఓటర్లు 5533 మంది ఉండగా పురుషులు 2895మంది, మహిళలు 2638మంది ఉన్నారు. ఎస్సీ ఓటర్లు 3624 మంది ఉండగా పురుషులు 1822మంది, మహిళలు 1802 మంది ఉన్నారు. ఇతరులు 11,117 మంది ఉండగా పురుషులు 5661, మహిళలు 5511 ఉన్నారు.

కుటుంబ సభ్యులందరికీ ఒకే వార్డు..

గ్రామ పంచాయతీలో 10 వార్డులుంటే గ్రామంలోని మొత్తం ఓటర్లను 10 భాగాలుగా విభజన చేస్తున్నారు. ఓటరు నంబర్ సీరియల్ ఆధారంగా ఆయా వార్డుల్లో ఓటరు జాబితాను రూపొందిస్తున్నారు. అయితే ఒక కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే వార్డులో చేర్చాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కార్యదర్శులు ఆ దిశగా వార్డులను తయారు చేస్తున్నారు. గతంలో ఒకే కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు వార్డులలో ఉండటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కుటుంబంలోని ఓటర్ల సీరియల్ నంబర్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ ఒకే వార్డులో చేర్చాలని నిర్ణయించారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

ఓ వైపు ఓటరు జాబితా ప్రక్రియ జరుగుతుండగా మరో వైపు పంచాయతీ రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొన్నది. గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసింది. దీని ప్రకారం పదేళ్లు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్లను కొనసాగిస్తుందా, కొత్తగా అమలు చేస్తారా అనే అంశంపై స్పష్టత కరువైంది. దీంతో సర్పంచ్ పదవికి పోటీ చేసే నాయకుల్లో రిజర్వేషన్ టెన్షన్‌కు గురి చేస్తుంది.

షెడ్యూల్ ఇలా..

- 6న గ్రామ పంచాయతీలో వార్డుల వారిగా ఫొటో ఓటరు జాబితా ప్రదర్శన.
- 7 నుంచి 13 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ.
- 9న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం.
- 10న అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ సమావేశం.
- 19న డీపీఓ స్థాయిలో అభ్యంతరాల పరిష్కారం.
- 21న వార్డుల వారిగా తుది ఓటరు జాబితా విడుదల.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి



అర్వపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి చంద్రశేఖర్

అర్వపల్లి : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గాజుల చంద్రశేఖర్ అన్నారు. అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని అన్నారు. అలాగే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని కోరారు. వైద్యసిబ్బంది విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సీహెచ్. మణిదీప్, సీహెచ్‌ఓ ఎం. బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, ఫార్మసిస్టు మాధవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం



లక్ష్మాపురంలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం

నాగారం : రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం నాగారం మండల పరిధిలోని లక్ష్మాపురంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు విద్యావంతులుగా ఎదగాలని కోరారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించొద్దన్నారు. కుల వివక్ష లేకుండా అందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



తిరుమలగిరి : ఓటరు జాబితాపై శిక్షణను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణు మాధవరావు

తిరుమలగిరి : ఓటరు జాబితాను వార్డుల వారీగా ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా రూపొందించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవరావు కోరారు. తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూడాలని కోరారు. ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరినీ ఒకే వార్డులో చేర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఎంపీడీఓ లాజర్ పాల్గొన్నారు.

ఓటరు నమోదును త్వరితగతిన పూర్తి చేయాలి

నాగారం : ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూర్యాపేట ఆర్డీఓ ఆర్.వేణుమాధవరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. బీఎల్‌ఓలు గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని సూచించారు. డోర్ టు డోర్ సర్వేను వేగవంతంగా నిర్వహించి, వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియను, గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటరు జాబితా ఏర్పాటును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఎంపీఓ మారయ్య, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు, ప్రజాపాలన సేవా కేంద్రాల పరిశీలన

నూతనకల్ : బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల నమోదును పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల నమోదు, ప్రజాపాలన సేవా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1 జనవరి 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని ఆయన సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితాలో తప్పిదాలను సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ఓటరు లిస్టును అధికారులు పకడ్బందీగా తయారు చేయాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు తప్పకుండా ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్లను గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



రాములు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు

సూర్యాపేటటౌన్ : పట్టణానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జలగం రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ ఏఆర్ పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. శనివారం సూర్యాపేటలో ఆయన దశదిన కర్మ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్షా 40వేల ఆర్థికసాయం అందజేశారు.

రుణమాఫీ కాని రైతుల ఇంటింటి సర్వే



చివ్వెంల : బి.చందుపట్లలో సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు శనివారం రుణమాఫీ కాని రైతుల ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల దరఖాస్తులు స్వీకరించారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించారు. రైతుల పేరు బ్యాంకులో సరిచూసుకోవాలని, సెప్టెంబర్ 7వ తేదీలోపు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓలు ప్రియాంక, వెంకట్ రెడ్డి, శైలజ, రైతులు కలగాని వెంకన్న, శ్రీధర్ రెడ్డి, రమేష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య, భద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల వద్ద తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పెందోట గణేష్ కోరారు. శనివారం రామన్నగూడెంలో రుణమాఫీ కాని రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, నేరెళ్ల సత్యం, రైతులు చెంచల లక్ష్మయ్య, మన్నె గోవర్ధన్, శ్రీనివాస్, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కుటుంబ నిర్ధారణ

ఆత్మకూర్(ఎస్) : రెండు లక్షల రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమం మండల వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోంది. అధికారులు గ్రామాల్లో తిరుగుతూ రైతుల కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దివ్య, ఏఈఓలు పి.శివకుమార్, బాలాజీ, రాచకొండ శివ, పవన్ పాల్గొన్నారు.



అర్వపల్లి : రామన్నగూడెంలో వివరాలను నమోదు చేసుకుంటున్న ఏఓ గణేష్



ఆత్మకూరులో రైతుల కుటుంబాల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

పేద కుటుంబానికి ఆర్థికసాయం

సూర్యాపేట : పట్టణానికి చెందిన జెల్ల వెంకన్న మనవరాలు, నాలుగున్నర నెలల చిన్నారి ఆయుశ్రీ అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఆమె తలకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు దాతల ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం వారు గండూరి కృపాకర్‌ను సాయం కోరగా రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడారు. చిన్నారి శస్త్ర చికిత్సకు డబ్బులు ఎక్కువగా అవసరం ఉన్నందున దాతలు ఆదుకోవాలని కోరారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



అర్వపల్లి : తిమ్మాపురం-సంగెం రహదారిపై కోడూరు వద్ద ప్రవహిస్తున్న వాగు



వర్షపు నీటితో నిండిన అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం ఆవరణ



సూర్యాపేటలోని మానస నగర్ కాలనీలో ఇళ్ల ఎదుట నిలిచిన నీరు



తిరుమలగిరిలో రోడ్డుపై నిలిచిన నీరు

అర్వపల్లి : ఎడతెరిపి లేకుండా శనివారం కురిసిన వర్షానికి జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. తిమ్మాపురం-సంగెం రహదారిపై కోడూరు వద్ద వాగు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ రహదారిపై మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం జలమయమైంది. ఈ విద్యాలయంలోని 200 మంది విద్యార్థినులు వర్షపు నీటితో అవస్థలు పడుతున్నారు. అలాగే వివిధ గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. కోడూరులో ప్రాథమికోన్నత పాఠశాల వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. వివిధ గ్రామాల లింకు రోడ్లు బురదమడుగులుగా మారాయి. అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఆవరణ జలమయమైంది.

సూర్యాపేట రూరల్ : రెండు రోజులుగా సూర్యాపేట మండల పరిధిలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. చెరువులు, కుంటల్లోకి కొద్దిపాటి వర్షపు నీరు చేరింది. వర్షాలు కురుస్తుండటంతో పంట పొలాలకు, ఆరుతడి పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు చెబుతున్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. ఇప్పటికే మండల వ్యాప్తంగా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షంతో వాగులు, వంకలు పూర్తిస్థాయిలో నిండాయి. మండలంలో 49.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ లాలు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే ముసురుతో ప్రారంభమై శనివారం ఉదయం భారీ వర్షం పడింది. ఈ సీజన్‌లోనే మొదటిసారిగా భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షానికి పత్తి, పెసర, వరి పంటల్లో నీళ్లు నిలిచాయి. గ్రామాల్లోని కుంటలు, చెరువుల్లో మొదటిసారిగా నీళ్లు చేరుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్థంభించింది. చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా శనివారం కురిసిన ఎడతెరిపి లేని ముసురుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాలతో పెసర పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలో 52.5మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మద్దిరాల : వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసర సమయంలో తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

అర్వపల్లి : భారీ వర్షాల నేపథ్యంలో అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. వర్షాల వల్ల ఎలాంటి నష్టం జరిగినా, సాయమందాలన్నా కార్యాలయంలోని కంట్రోల్ రూంలో సిబ్బందికి తగు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ పార్టీ అధ్యక్షుడు హనుమంతు యాదవ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకొని కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కురాకుల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండ సోమయ్య, మూల వెంకట్ రెడ్డి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, బీజేపీ ఉపాధ్యక్షుడు మూల వెంకన్న, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బోడ మల్లయ్య, రాంరెడ్డి రమేష్, జక్కుల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అర్వపల్లి : పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని పర్సాయపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌తోపాటు గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పాఠశాల ఆవరణలో కంపచెట్లను తొలగించారు. చెత్తను ఎత్తి శుభ్రం చేశారు. అలాగే వీధుల్లో కూడా పారిశుద్ధ్య పనులు చేశారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ రావు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన

ఆత్మకూర్ (ఎస్) : 21వ జాతీయ పశుగణన కార్యక్రమంలో భాగంగా ఆదివారం నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మండల వ్యాప్తంగా పశుగణన నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి వేణుగోపాల్ రావు తెలిపారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు సేకరిస్తారని అన్నారు. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ పశు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

పసునూరు మోడల్ స్కూల్‌లో 'ఫ్రెషర్స్ డే'



ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్‌ఐ ఎం.ఐలయ్య అన్నారు. శనివారం పసునూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గత సంవత్సరం టెన్త్‌లో 10/10 జీపీఏ మార్కులు సాధించిన, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ నగదు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుంట రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, యాకమల్లు, కార్తీక్, మానస, రాజేందర్, కరుణాకర్, గణేష్, నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రిటైర్డ్ కండక్టర్‌కు సన్మానం

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన మాతంగి జానమ్మ ఆర్టీసీ కోదాడ డిపోలో 26 ఏళ్లుగా కండక్టర్‌గా విధులు నిర్వర్తించి శనివారం రిటైర్డు అయ్యారు. ఈ సందర్భంగా మునగాలలో తాడువాయి గ్రామపెద్దలు ఆమెను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్ రావు, తాడువాయి పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కోదాడ : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె.పూర్ణచందర్‌రావుకు శనివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, వీరారెడ్డి, వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, రాజారాం, ఇర్ల శ్రీనివాసరెడ్డి, బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల బహూకరణ

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల అంగన్‌వాడీ 1 కేంద్రానికి గ్రామానికి చెందిన తొట్ల మల్లయ్య శనివారం నాలుగు చైర్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బండపల్లి అన్నపూర్ణ మాట్లాడారు. అంగన్‌వాడీ అభివృద్ధి కోసం దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా పంతం సోమలక్ష్మి పాల్గొన్నారు.

యూత్ కమిటీ ఎన్నిక

తుంగతుర్తి : మండల కేంద్రంలో శివ పార్వతి యూత్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెంతబోయిన వెంకన్న యాదవ్, ఉపాధ్యక్షుడిగా గుండాల శ్రీశైలం, కోశాధికారిగా మెంతబోయిన లింగన్నతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, శ్రీను, మహేష్, సతీష్, సాయిలు, సురేష్, పవన్, మనోజ్ పాల్గొన్నారు.